డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల బిఏ, బికాం, బిబిఏ, బిసిఏ, బిఎస్ హానర్స్ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విసి ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. ఫలితాల విడుదల సందర్భంగా తన ఛాంబర్‌లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వై.పి వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డితో కలిసి పరీక్ష ఫలితాలను వెల్లడించారు. 2023 డిసెంబరులో నిర్వహించిన పరీక్షలకు 6,789 మంది విద్యార్థులు హాజరు కాగా 3,970 మంది ఉత్తీర్ణత సాధించారు. 54.48 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. బిఏలో 45.59 శాతం, బిబిఏలో 47.91 శాతం, బిసిఏలో 70.74 శాతం, బికాంలో 54.30 శాతం, బిఎస్సిలో 66.20 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. పరీక్షల విభాగాన్ని అభినందించారు.

తొలగని 'కాంట్రాక్ట్' వెతలు

- తప్పులతడకపై తగ్గని జిఎంసి
- సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు
- కళాశాల ఎదుట ఉద్యోగార్థుల ధర్నా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరసన సెగల మధ్య నడుస్తోంది. ప్రభుత్వం రెండు నెలల కిందట కడప జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, మానసిక, క్యాన్సర్, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని 14 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల నుంచి భర్తీ ప్రక్రియ వరకు అన్నీ తానై చేపట్టింది. రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా సెలక్షన్ లిస్టు ప్రకటించడంపై ఆందోళన నెలకొంది. రిజర్వేషన్ల గుర్తింపు దగ్గర నుంచి, ఆయా పోస్టులకు అర్హతల నిర్ధారించడం వరకు వివాదమైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ మెడికల్ ఫిజిక్స్ ఉద్యోగార్థి న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిక్స్, మెడిసిన్ ఫిజిక్స్ పోస్టులకు దరఖాస్తు చేశారు. విచిత్రమేమిటంటే తను చదవని చదువుకు సంబంధించిన పోస్టుకు సెలక్షన్ కమిటీ ఎంపిక చేయడం గమనార్హం. మొదటి నుంచి నోటిఫికేషన్‌లో తప్పిదం దొర్లిందంటూ పరిశీలన చేయలని వాపోతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. సెలక్షన్ లిస్టులో ఎంపికైన ఉద్యోగానికి సంబంధించిన సర్టిఫికెట్లు లేవని వాపోతున్నారు. కర్నూలు, గుంటూరు వైద్య కళాశాలలు తప్పును సవరించి రీనోటిఫికేషన్ ద్వారా భర్తీ చేశాయని వాపోతున్నారు. బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ కేటగిరీలో రిజర్వేషన్ మార్చేశారనే వాదన వినిపిస్తోంది. ఎస్‌సి కేటగిరీ అభ్యర్థికి ఓసి కేటగిరీలో ఎంపిక చేయడం, ఎస్‌సి కేటగిరీని వికలాంగ్ పెట్టడమేమిటనే విమర్శ వినిపిస్తోంది. క్యాన్సర్‌లో ల్యాబ్ విభాగానికి సంబంధించిన మెరిట్ మార్చేశారనే వాదన వినిపిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు డిగ్రీని అర్హతగా ప్రకటించారు. పీజీ (డిప్లొమా) చేసిన వారిని అర్హులుగా చేయడంలో అర్థం లేదని వాపోతున్నారు. రాష్ట్రంలోని రాజమండ్రి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అర్హులుగా తీసుకున్నారని ఆధారాలతో సహా చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. తమ అభ్యంతరాల పట్ల స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వకుండా ఎలా భర్తీ చేస్తారని నిరసన తెలుపుతున్నారు. ఇటువంటి తప్పిదాలను సవరించాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కళాశాల ఎదుట పలువురు ఉద్యోగార్థులు గురువారం ధర్నా ప్రదర్శన నిర్వహించారు. రివైజ్డ్ ఫైనల్ లిస్టును ప్రకటించిన అనంతరం పోస్టులను భర్తీ చేయాలని, తప్పులను సవరించిన తర్వాత ముందుకెళ్లాలని డిమాండ్ చేయడం విశేషం. ఇప్పటికైనా సర్వజన ఆస్పత్రి కళాశాల యాజమాన్యం సానుకూల వాతావరణంలో సమస్యల్ని పరిష్కరించిన అనంతరం రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో నోటిఫికేషన్, రిక్రూట్‌మెంట్ తీరుతెన్నులను సవాల్ చేసే తీరుతామని ప్రకటించడం గమనార్హం. రిక్రూట్‌మెంట్ అవకతవకల వ్యవహారం డిప్యూటీ సిఎం దృష్టికి వెళ్లడంతో సీరియస్‌గా స్పందించినట్లు తెలుస్తోంది.

కడప రిమ్స్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగార్థులు

పెన్నాకు నీరొచ్చేనా.. తాగునీటి కష్టాలు తీరేనా..

మైలవరం నుంచి వదిలిన నీరు ఇంకిపోతున్న వైనం

ప్రజాశక్తి-చెన్నూరు

వేసవిని దృష్టిలో పెట్టుకొని కడప నగరానికి తాగునీటి సమస్య తీర్చేందుకు వారం రోజుల కిందట మైలవరం జలాశయం నుంచి అధికారులు పెన్నా నదికి నీటిని వదలారు. ఇంతవరకు వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లి పెన్నానదిపై నిర్మించిన ఆనకట్టకు నీరు రాలేదు. సిద్ధవటం మండలం లింగంపల్లి వద్ద కడప నగరానికి తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన పంపింగ్ స్కీం వరకు, అలాగే కడప నగరం పరిధిలో పెన్నా నది వాటర్ గండి పంపింగ్ స్కీం వరకు నీటి సరఫరా కావాల్సి ఉంది. ప్రస్తుతం పెన్నా నది పూర్తిగా ఎండిపోయింది. దీని కారణంగా తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటిని వదిలారు. వచ్చిన నీరంతా పెన్నా నదిలో ఇంకిపోతున్నది. పెన్నానది నుంచి ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తుండడంతో పెన్నా నదిలో నీటి ప్రవాహం ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పెన్నా నది ఎగువ భాగంలో గండికోట, మైలవరం జలాశయాల్లో నీరు ఉన్నప్పటికీ పెన్నా నదికి ఎక్కువ శాతం నీటిని వదలడం లేదు. కడప నగరానికి తాగునీటి అవసరాల కోసం కర్నూలు జిల్లా బనగానపల్లి సమీపంలో అవుకు రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఉంచి అవసరాలకు వదలాల్సి ఉంది. కానీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఏడారిని తలపిస్తున్న పెన్నానది

మహిళల జీవితాల్లో వెలుగులు : జెసి

కడప : ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్ఆర్ చేయూత' పథకం జిల్లాలోని వేలాది మంది మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా కాశింకోట బహిరంగ సభ నుంచి వరుసగా 4వ ఏడాది 'వైఎస్ఆర్ చేయూత' సాయం మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి జెసితోపాటు రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్ రెడ్డి, డిఆర్‌డిఎ, మెప్మా పిడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, ఎస్‌సి, బిసి కార్పొరేషన్ల ఇడిలు డాక్టర్ వెంకటసుబ్బయ్య జయసింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విసి అనంతరం 4వ విడతలో జిల్లా వ్యాప్తంగా 91,767 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.172,06,31,250 మెగా చెక్కును ముఖ్య అతి థులతో కలిసి జెసి లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, మెప్మా, జిల్లా ఎస్‌సి, బిసి సంక్షేమ శాఖలు, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్ అధికా రులు, సెర్ప్ ఉద్యోగులు, సంక్షేమ శాఖాధికారులు, మహిళలు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం : ఎంపిపి

వేంపల్లె : రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవారి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిజం చేశారని ఎంపిపి లక్ష్మిగాయిత్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక సచివాలయం-1లో జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాలోని పథకమైన ఇంటి నిర్మాణం చేపట్టి పేదవాడికి అండగా నిలిచారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించినట్లు చెప్పారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ వైసిపికి ప్రజలు పట్టం కడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కటిక చంద్ర, మణిగోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు వెంకటేష్, బికారి, బాబయ్య, సచివాలయ కన్వీనర్ నసీమ్ బాషా, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ఉరుసు ఉత్సవాలు

కడప అర్బన్ : నగరంలోని రవీంద్ర నగర్ లో వెలసి ఉన్న ఆస్థాన ఏ షహమీరియ దర్గా ఉరుసు ఉత్సవాలు దర్గా పీఠాధిపతి హాజరత్ సయ్యద్ షా మొహమ్మద్ హుసేని బాష షహమీరి సాహెబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గంధం కళాశాన్ని ఫకీర్ల మేళ తాళాలు, విన్యాసాలతో దర్గా వద్దకు చేరి దర్గాలో సమర్పించి ఫాతెహా చేసి ప్రార్థనలు నిర్వహించారు. యాత్రికులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

కడప : ప్రభుత్వ పురుషుల కళాశాలలోని జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో టూల్స్ అండ్ టెక్నిక్స్ ఇన్ బయోలాజికల్ సైన్సెస్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసుకున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులలో పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొం దించడానికి ఇటువంటి సర్టిఫికెట్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు. సర్టిఫికెట్ కోర్స్ కన్వీనర్ డాక్టర్ వై సావిత్రి కోర్సు ప్రాముఖ్యతను వివరించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రవిశేకర్ మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న వివిధ రకాల పరికరాలు వాటి యొక్క పని చేసే విధానం వాటి అను వర్తనం తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొ ందించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి మహేష్, ద్వితీయ సంవత్సరం బిజెడ్‌సి విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

మైనార్టీలకు పెద్దపీట : డిప్యూటీ సిఎం

కడప : మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిదేనని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. గురువారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నూర్ ఏ జహాన్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఖాజీలకు మూడేళ్ల కాల వ్యవధిని పదేళ్లకు పెంచిన సందర్భంగా ప్రభుత్వ ఖాజీలకు ప్రభుత్వ ఉత్తర్వులు, గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మినిస్ట్రీ ఫర్ మైనార్టీ వెల్ఫేర్ ద్వారా రాష్ట్రంలో సుమారుగా 200 మందికి పైగా గవర్నమెంట్ ఖాజీలుగా ఉన్నారని, వారందరికీ జీవో కాపీలను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ముఫ్తీ మహమ్మద్ అలీ బోద్దాది, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సిఇఒ అబ్దుల్ ఖాదిర్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జప్పుల్ల, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, రాష్ట్ర ఖాజీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ షఫీ ఖాద్రి, సెక్రటరీ హాఫీజ్ ఇషాక్ పాల్గొని ప్రసంగించారు.

కష్టపడితే ఏదైనా సాధ్యం

కడప అర్బన్ : విద్యార్థులు తలుచుకుంటే ఏమైనా సాధించగలరని ప్రముఖ మోకాళ్ళ కీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి అన్నారు. గురువారం కెఒఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 2కె24 పేరుతో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని పేర్కొన్నారు. కందుల విద్యాసంస్థల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు ఉన్నారని తెలిపారు. వైస్ చైర్మన్ కందుల మదనమోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మంచి ప్రతిభ చూపి రాణించాలని పిలుపునిచ్చారు. సెక్రటరీ శనివారపు లిఖిత మాట్లాడుతూ ఉన్నత ఆశయాలు కలిగిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైసిపి ప్రభుత్వంలోనే సంక్షేమాభివృద్ధి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష, నగర మేయర్ సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక గూడూరులో రూ.94 లక్షలు అంచనా వ్యయంతో గార్బేజ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్, రూ. 1.50 కోట్ల అంచనా వ్యయంతో గార్బేజ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్, చిన్న చౌక్‌లో ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష, నగర మేయర్ కే సురేష్ బాబు చేతుల మీదుగా ప్రారంచింఆరు. స్థానిక 28వ డివిజన్ కార్పొరేటర్ ఆరిఫ్లు ఆధ్వర్యంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్డుకు శంకు స్థాపన చేశారు. కార్యక్రమాలలో డిప్యూటీ మేయర్లు నిత్యానంద రెడ్డి, ముంతాజ్ బేగం, మునిసిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, కార్పొరేటర్లు షేక్ మొహమ్మద్ షఫీ, బసవరాజు, కిరణ్, చెన్నయ్య, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, సూర్య నారాయణ, కుర్ర లక్ష్మీదేవి, వీరారెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, ఆర్తీపుల్ల, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, చాక్లెట్ గౌస్, జమాల్ బాష, జిలాన్‌బాష, ఎస్ఎండి జిలాన్, ఎంఆర్ జె రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయండి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కడప అర్బన్

నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులను తెలియజేసేందుకు ఈనెల 10న నిర్వహించే విద్యా సదస్సు జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ప్రభుత్వ, ప్రయివేట్ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్సీ కార్యాలయంలో జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు మేడా కన్వెన్షన్ సెంటర్లు సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. విద్యావేత్తలు డాక్టర్ పరం జ్యోతి, అచలానంద మహారాజ్ ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్ బాష, ఎంపీ అవినాష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు రఘునాథరెడ్డి, మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

ప్రతి మహిళా స్వయం శక్తి సాధించాలి

- జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప / కడప అర్బన్

ప్రతి మహిళా అఘాయిత్యాలకు లోనుకాకుండా స్వయంశక్తి సాధించాలని, హింసకు గురైనప్పుడు గృహహింస చట్టం ద్వారా మహిళలకు కావాల్సిన రక్షణ, మనోవృత్తి పొందవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురోగతి వైపు బాటలు వేస్తున్నారని చెప్పారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని సభా భవన్ లో ముందస్తు మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గజ్జల లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. మహిళ కమిషన్ ద్వారా మహిళకు ఏమైనా సమస్యలు ఉంటే వాటి గుర్తించి కమిషన్ దృష్టికి తీసుకెస్తే వెంటనే పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా పాటు పడుతుందని తెలియజేశారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కర్నూల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి. రోహిణి మాట్లాడుతూ మహిళలు పిండ దశ నుంచే దాడులు ఎదుర్కొంటున్నారని, మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలంటే ప్రతి మహిళా విద్యావంతురాలై ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండాలని అన్నారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి. శ్రీ లక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలని, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ద్వారా అందించే సేవల గురించి వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళా ఉద్యోగులకు సత్కారం చేశారు. కార్యక్రమంలో జిల్లా యందలి జిల్లా మహిళా అధికారులు, సిడిపిఒలు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, మహిళా పోలీసులు, ఐసిడిఎస్, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, సహాయకురాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. **ప్రభుత్వ పురుషుల కళాశాలలో** మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలను గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ రోజువారీ కార్యక్రమాలలో మహిళల పాత్రను చర్చిస్తూ, రాజకీయాలలో మహిళా రిజర్వేషన్ల శాతం పెరగడాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాయచోటిలో అర్చనా నర్సింగ్ హోమ్ వైద్యురాలు డాక్టర్ సి.విజయ కుమారి, సీనియర్ లెక్చరర్ శివపార్వతి, కన్వీనర్ డాక్టర్ కల్పన, కో - కన్వీనర్ రాజేశ్వరి, డాక్టర్ సావిత్రి, అనిత, కృష్ణవేణి, రాధిక, రేణుక ఇతర మహిళా అధ్యాపకేతర సిబ్బంది, మహిళా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంకాల నాగరాజు పాల్గొన్నారు. **విద్యుత్ భవన్‌లో..** సమాజంలో మహిళలు తమ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఎస్. రమణ అన్నారు. గురువారం కడప నగరంలోని విద్యుత్ భవన్ లోని సమావేశ మందిరంలో ముందస్తు జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలతో కేక్ కట్ చేయించి ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగరాజు, హరిసేవ నాయక్, డిఇఇలు, విద్యుత్ సంస్థలోని మహిళలు పాల్గొన్నారు. **జిల్లా పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో..** ఏడి పి.వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి పి.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సాధికారిక సాధన దిశగా మహిళలు ముందడుగు వేయాలన్నారు. డిఎల్ పిఆర్ఒ సునీల్ సాగర్, ఎవిఎస్ నాగయ్య, అనంతరం మహిళా ఉద్యోగులందరూ సాధికారతకు సంఘీభావం వ్యక్తం చేస్తూ కలిసికట్టుగా కేకును కట్ చేశారు. కార్యక్రమంలో డిఎల్‌పిఆర్ఒ మస్తాన్ సాహెబ్, పిఆర్ఒ రవికుమార్, ఫోటోగ్రాఫర్ సోహైల్, ఈశ్వరయ్య, అజ్మతుల్లా, హరిబాబు, లక్ష్మీపతి, వీరారెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు. **టిడిపి ఆధ్వర్యంలో..** మహిళలకు అన్ని రంగాలలో ప్రత్యేక స్థానం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు అలంకాన్ పల్లి లక్ష్మీరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి అన్నారు. నగరంలోని అలంకాని పల్లె లక్ష్మీ రెడ్డి కార్యాలయంలో టిడిపి సీనియర్ మహిళ నాయకురాళ్లను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు జయరాం రెడ్డి, పాలకొండ గుడి మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, తెలుగు యువత నగర మాజీ అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, నగర మాజీ మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్, 39 వ డివిజన్ సీనియర్ నాయకులు ఇలియాస్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, నూర్ బాషా, గంగులయ్య కిషోర్ పాల్గొన్నారు. **కెఎల్‌ఎంలో..** మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హజరత్ అయేషా కాలేజ్ ప్రిన్సిపల్ హసీనా మాట్లాడుతూ మహిళలు ఎన్నో పాత్రలు సక్రమంగా పోషిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు. **ఇంటాక్ ఆధ్వర్యంలో..** మహిళల రక్షణకు అవసరమైన ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకుని అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పీడీ డి. శ్రీలక్ష్మి తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) కడప చాప్టర్ కన్వీనర్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి, కో- కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆమె ప్రసంగించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ శశికళ , డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, చిన్న కళావతి కళాశాల, డాక్టర్ సలీంబాష ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది అతిథులను ఘనంగా సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పారిశ్రామికవేత్త వై. అసంతమ్మ, ఇంటాక్ సభ్యులు కొండూరు జనార్దన రాజు, కొండారెడ్డి, భారవి, రాఘవేంద్ర వర్మ, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు. **చెన్నూరులో..**విజేత మహిళా మండలి ఆధ్వర్యంలో రెడ్డిగారివీధిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు జయశ్రీ, వెంకట సుబ్బమ్మ హాజరై మాట్లాడారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర చాలా అవసరమని చెప్పారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా 'నారిశక్తి పురస్కారం - 2024' అవార్డ్‌తో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజేత మహిళా మండలి అధ్యక్షురాలు గొసుల అరుణ కుమారి, జయమని, సుబ్బమ్మ, శ్యామల, మీకోసం విష్ణు వర్ధన్, సువర్ణ, రహమతున్నిష, ఇతర సేవా సంస్థ ప్రతినిధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె** : సమానత్వం, అభివృద్ధిలో మహిళ పాత్ర చాలా గొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, వెలుగు కార్యాలయంలో, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, కో-ఆర్డినేటర్ కిరణ్మయి, శివ, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు, నెహ్రూ యువ కేంద్రం యూనిట్ సభ్యులు, హెచ్ఎం శివ మునెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చాపాడు** : మహిళలకు అన్ని రంగాల్లో ప్రాముఖ్యత అందుతుందని డాక్టర్ పి.ఓబులేసు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మహిళా డాక్టర్ కావ్య మాధురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మహాదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ బాబురెడ్డి, సరస్వతి, యంఎల్‌హెచ్‌పిలు, ఏయన్‌యంలు, ఆసుపత్రి సిబ్బంది, ఫార్మసిస్ట్ సుభాషిణి, పర్యవేక్షకులు నారాయణరెడ్డి, భాస్కర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయుల రెడ్డి తెలిపారు. జిల్లా సమతా కో-కన్వీనర్ హన్నా ఎస్తేర్, జెవివి జిల్లా కార్యదర్శి సుజన్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షులు దినేష్, పీటర్, సుజయ్, ఉపాధ్యాయులు శశికళ, సుగుణ, చౌడేశ్వరి, పావని, ఈశ్వరయ్య, ప్రభుకుమార్ పాల్గొన్నారు. **మైదుకూరు :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జడ్పిటిసి లక్ష్మీ ప్రసన్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం మైదుకూరు వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం కడప శాఖ, అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి హాజరయ్యారు. వెలుగు ఎపిఎం సుజాత మాట్లాడారు. మై భారత్ వికసిత్ భారత్ నారి శక్తి ఫిట్నెస్ రన్ కార్యక్రమాల్లో భాగంగా ఎపిఎం సుజాత, జడ్పిటిసి సభ్యురాలు ప్రసన్నలక్ష్మీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు వివిధ రకాల ఆటలు నిర్వహించి బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి మహిళకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వాగ్దాడం శివశంకర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఖాజా హుస్సేన్, శివగంగిరెడ్డి, చంద్రారెడ్డి, రసూల్, నెహ్రూ యువ కేంద్ర వాలంటరీ సురేంద్ర పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుస్మితా, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరు సమీపంలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ రామ సుబ్బమ్మ అధ్యక్షతన ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కళాశాల కో-డైరెక్టర్ శైలూష, డిప్లొమా ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలను సన్మానిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగికి మెమెంటో అందజేస్తున్న విద్యుత్ ఎస్ఇ

9,10న సిఐటియు జిల్లా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఐటియు జిల్లా శిక్షణ తరగతులు ఈ నెల 9, 10 తేదీల్లో నగరంలోని పాత బస్టాండ్ సిఐటియు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. ఎన్నికల తరుణంలో ఉద్యోగులకు, అసంఘటిత, సంఘటిత, కార్మికులు, స్కీం వర్కర్లకు చేస్తున్న అన్యాయాల పైన, ప్రస్తుత రాజకీయాల పైన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే తరగతులకు సిఐటియు జిల్లా, వివిధ రంగాల నాయకత్వం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఐదేళ్లూ ప్రజలకు కష్టాలు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఐదేళ్లుగా నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో నివాసమున్న పేదలు, మైనార్టీలు వరదల్లో సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలి కష్టాలు పడుతున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ నిరాశ్రయులకు వైసిపి ప్రభుత్వం ఆశ్రయం కల్పించక పోవడం దుర్మార్గమైన చర్యగా ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా నారచంద్రబాబు నాయుడు అయిన తరువాత నగర ప్రజలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. కడప అసెంబ్లీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాధవిరెడ్డి విద్య వంతురాలని, ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకురాలని చెప్పారు. అనతికాలంలోనే మాధవిరెడ్డి నగరప్రజల్లో మమేకమై ప్రజాదరణ పొందిన నాయకురాలిగా నిలిచారన్నారు. కడప అసెంబ్లీ ఎన్నికలలో విజయ పథంలో నిలిచేందుకు తోడ్పాటును అందించాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారానికి బోర్లు ఏర్పాటు

చాపాడు : మహాశివరాత్రి సందర్భంగా అల్లాడుపల్లెకు వచ్చే భక్తులకు స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందులు లేకుండా కుందూ నదిలో బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. సీతారామాపురం సర్పంచ్ స్వాతి, వైసిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి బోరు, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశారు. కుందూనదిలో నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆలయ చైర్మన్ జివై వెంకట సుబ్బారెడ్డి, ఇఒ శ్రీనివాసులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

గ్రామీణ దుకాణం ప్రారంభం

వేంపల్లె : మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు సుస్థిర వ్యవసాయ కేంద్రం రాయలసీమ ఇన్‌చార్జ్ ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముసల్ రెడ్డిగారిపల్లెలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో భావన, గాయత్రీ మహిళ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె వంటలు-గ్రామీణ దుకాణంను సుస్థిర వ్యవసాయ కేంద్రం రాయలసీమ ఇన్‌ఛార్జ్ ఆదినారాయణ ప్రారభించారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త రామాంజనేయులు, నాబార్డు డిడిఎం విజయ విహారి, డిసిసిబి మేనేజర్ బాలాజీ, హార్టికల్చర్ హెచ్ఓ రెడ్డయ్య, ఎస్‌పిఓ చైర్మన్ మల్లు స్వరమ్మ, తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సేంద్రియ వ్యవసాయ కేంద్రం సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు..

న్యాయ సాధన ప్రతిజ్ఞలో జిల్లా నాయకులు

కడప : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో సీకే కన్వెన్షన్ సెంటర్‌లో న్యాయ సాధన ప్రతిజ్ఞ గురువారం నిర్వహించారు.రాష్ట్రం నుండి కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ పార్లమెంట్ స్థానాలకు దరఖాస్తు చేసుకున్న అందరితో ప్రమాణం చేయించారు. వైఎస్ఆర్ జిల్లా నుంచి జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, ఎన్ ఎస్ వి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధ్రువ కుమార్ రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు చక్రాయపేటలో మహాశివరాత్రి ఉత్సవాలు

భారీ ఎత్తున అన్నదానం.. రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దులతో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల కేంద్రం చక్రాయపేటలో శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 8న మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థాన చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి అడ్వకేట్ తెలిపారు. గత నెల 21 నుండి మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 92 గ్రామాల్లో ప్రతి గ్రామానికి అన్నాన ప్రతిష్ఠతోపాటు శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వర స్వామి లక్ష్మీదేవి సరస్వతి, ఉత్సవ విగ్రహాలతో ఐదు గుర్రాల రథంపై పలు రకాల పూల అలంకరణతో గ్రామోత్సవం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏడేళ్ల నుంచి రామాపురం వాస్తవ్యులు మల్‌రెడ్డి మురళీధర్‌రెడ్డి, వారి ధర్మపత్ని అమరావతి అన్నదాన కార్యక్రమం భారీ ఎత్తున చేపడుతున్నారు. బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ.70,000 మొదలుకొని చివరి ఏడవ బహుమతి పదివేల రూపాయల వరకు దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. బండ లాగుడు పోటీల్లో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి న్యూ కేటగిరి ఎద్దు పాల్గొంటాయి. మహాశివరాత్రిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు.

శివరాత్రికి ముస్తాబైన కోన గవేశ్వరుడి ఆలయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని మోట్నూతలపల్లి గ్రామ సమీపంలో వెలసిన కోన గవేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పండుగను పురస్కరించు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త ఓబుల్‌రెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేశామన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆలయానికి వెళ్లేందుకు చక్కటి రహదారిని ఏర్పాటు చేశామన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఎడ్లతో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ జివి వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు, సర్పంచ్ జి.కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానులకు కమలాపురం మండలం కృష్ణాపురంపల్లెకు చెందిన కె.లక్ష్మణరెడ్డి రూ.1,00,116 బహుమతిగా అందజేయనున్నారు. రెండవ బహుమతిని లక్ష్మీపేట కర్నాటి నారాయణరెడ్డి రూ.70,116, మూడవ బహుమతిని అల్లాడుపల్లె రజకుల సంఘం, చెన్నూరు జ్యువెల్లర్స్ వారు సంయుక్తంగా రూ.60116, నాలుగో బహుమతిని చియ్యపాడు గ్రామానికి చెందిన కత్తాయిని కృష్ణారెడ్డి ఎంఏ పివి రమణారెడ్డి రూ.40,116, 5వ బహుమతిని బ్రహ్మంగారి మఠం వి రవీంద్రనాథరెడ్డి రూ.20,116, 6వ బహుమతిని నరహరిపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12,116, 7వ బహుమతిని కోరాడు వెంకటేష్ కుటుంబ సభ్యులు రూ.5,116 అందజేయనున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొను ఎడ్ల యజమానులు ఈనెల 9న ఉదయం 11 గంటలలోపు కమిటీ సభ్యులకు తమ పేర్లు తెలియజేయాలని వారు కోరారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే జగనన్న లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, చంద్రమౌళి, కౌన్సిలర్ కోడి రమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక గుంటిగట్టు, సీయోనుపురం సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మలివిడత కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం ప్రారంభించిన జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం స్థానిక బొల్లవరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. వైద్యులు అభిలాష్, హేమంత్, హిమబిందు ఆప్తాల్మిక్ ఆఫీసర్ యంయస్‌తేజ వైద్యపరీక్షలు నిర్వహించారు. 373 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శౌరి సుభాష్‌రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

సందిగ్ధ షార్ట్ ఫిల్మ్‌ను ప్రారంభించిన ఎస్ఐ

పులివెందుల రూరల్ : సందిగ్ధ షార్ట్ ఫిల్మ్ గురువారం పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ షార్ట్ ఫిల్మ్‌కు స్క్రీన్ ప్లే మంజునాథ్‌రెడ్డి అందించగా, డైరెక్షన్ మునువర్ధన్, ప్రొడ్యూసర్ హరి, ముఖ్యపాత్రలో మన పులివెందులకు చెందిన క్యారెక్టర్ ఆర్టిస్ట్ మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పఠాన్, శ్రీనాథ్, రాఘవేంద్రారెడ్డి, హరి, కిట్టు, జయరాంరెడ్డి, వామన సాయి, స్నేహిత అమృత సేవ సమితి అధ్యక్షుడు రాజు, కష్ణ, దేవ, అవినాష్, 999 ఇండియా నాని, అను, హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు మేలు జరిగేలా ఇలాంటి లఘు చిత్రాలు తీయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తొందరలో ఈ సందిగ్ధ షార్ట్ ఫిలిం రిలీజ్ కాబోతుందన్నారు.

పనులు వేగవంతం చేయాలి

పులివెందుల రూరల్ : స్థానిక పాత సంత మార్కెట్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రమణారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో సిఎం జగన్ పర్యటన ఉండే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పనులు సత్వరమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఎవరికి కేటాయించిన గదులలో వారే ఉండాలని ఇతరులకు అద్దెకు ఇవ్వకూడదని, అలా ఎవరైనా ఇస్తే వెంటనే వారి రూమును రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సోపాల వీర, గంగిరెడ్డి పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులందరూ కలిసికట్టుగా పనిచేయాలి

పులివెందుల రూరల్ : ప్రశాంతి నగర్, అంకాలమ్మపేట సచివాలయం పరిధిలోని 80, 81, 82, 83, 84, 87 పోలింగ్ బూత్ పరిధిలోని బూత్ కన్వీనర్లతో, సభ్యులతో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని జెసిఎస్ ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో గురువారం వైయస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో నిర్వహించారు. వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, వాల్మీకి సంఘ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, హాజరయ్యారు. కార్యక్రమంలో జెసిఎస్ ఇన్‌ఛార్జి చంద్రమౌళి, కౌన్సిలర్ కోడి రమణ, మధుసూదన్ రెడ్డి, సోపాల వీర, సంపత్, విజయ్, శేషయ్య గౌడ్, శ్రీరాములు, మోటారాజ, అరుణ, పార్వతమ్మ, సుబ్బ కేశవ, సురేంద్ర, వేణు, రత్నమ్మ, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భారీగా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

భారీగా పాండిచ్చేరికి చెందిన మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు సెబ్ ఎఎస్‌పి సూచనలతో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం అమ్మకాలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో గురువారం పాండిచ్చేరికి చెందిన రూ.60వేల విలువ కలిగిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్ అను వ్యక్తులను వాసవి సర్కిల్ వద్ద అరెస్టు చేసి వారి వద్దనుండి 74 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. వీరు రైలులో పాండిచ్చేరికి చెందిన మద్యం తెచ్చి అమ్ముకునేవారన్నారు. అధిక ధరలకు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో అమ్మేవారన్నారు. అక్రమంగా టిప్పర్లు, ట్రాక్టర్లలతో ఇసుకను రవాణా చేసినా, జూదం, మట్కా, గంజాయి అమ్మకాలు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దాడులలో ఎస్ఐ కిషోర్ పాల్గొన్నారు.

ముద్దనూరు : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గురువారం అక్రమంగా మద్యం తరలిస్తున్న సింహాద్రిపురం మండలం కోరగుంటపల్లె గ్రామానికి చెందిన ఒంటెద్దు నవకోటి లింగారెడ్డిని అరెస్టు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. అతని వద్ద నుండి 12 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

పట్టుదల, పనిలో ఏకాగ్రత అభివృద్ధికి సోపానాలు

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

తినుబండారాలను తయారు చేస్తున్న మహిళలు

తయారు చేసిన తినుబండారాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అభివృద్ధి సాధించాలనే పట్టుదల, పనిలో ఏకాగ్రత ముఖ్యమని స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన షీలాదేవి నిరూపించారు. పదేళ్ల క్రితం తినుబండారాల వ్యాపారం చిన్నచిన్నగా మొదలు పెట్టి.. నేడు రూ.20లక్షల టర్నోవర్ తోపాటు 15మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మొదట్లో (పదేళ్ల క్రితం) చెనిక్కాయ ఉంటలు, బాదుషా, మైసూర్‌పాక్ వంటి తినుబండారాలను చేత్తో తయారు చేసి స్థానికంగానే మార్కెట్ చేసేవారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు రెండు మూడు రకాల తినుబండారాల తయారీ నుండి ప్రస్తుతం 10 నుండి 12 రకాల తినుబండారాల తయారీ వరకు పురోగతి సాధించారు. తొలుత డ్వాక్రా సభ్యురాలిగా చేరి శివసాయి గ్రూప్ ద్వారా కొంతమంది మహిళల సహకారంతో వ్యాపారాభివృద్ధి చేశారు. చేతితో తయారు చేసే స్థాయి నుండి ప్రస్తుతం యంత్రాలతో తినుబండారాలను తయారు చేసే స్థాయికి ఎదిగారు. వీరి ఉత్పత్తులు కడప, అన్నమయ్య జిల్లాలతోపాటు నంద్యాల, కర్నూల్, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు సరఫరా అవుతున్నాయి. అంతే కాక ప్రభుత్వం తరచూ ఏర్పాటు చేసే మెప్మా బజార్‌లో వీరి ఉత్పత్తులు స్థానం సంపాదించాయి. ఉత్పత్తులు సొంత వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. షీలాదేవి వ్యాపారాభివృద్ధిని చూసి పలు బ్యాంకులు రుణం ఇచ్చేందుకు పోటీ పడుతున్నాయి. ప్రారంభంలో ఓ చిన్న ఇంట్లో ఒంటరిగా మొదలుపెట్టిన వ్యాపారం నేడు ఓ చిన్నపాటి పరిశ్రమను తలపించేలా తీర్చిదిద్దిన షీలాదేవి భవిష్యత్తులో మరింత అభివృద్ధిని సాధించాలని కోరుకుందాం.

యజమాని షీలాదేవి

నేటి లక్ష్యమే రేపటి విజయానికి నాంది

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

విద్యార్థుల నేటి లక్ష్యమే రేపటి విజయానికి నాంది అవుతుందని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వేమారెడ్డి సత్రంలో గురువారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పరీక్షలకు సంసిద్ధం అనే కార్యక్రమాన్ని ఎంఇఒలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ అధికారి దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మారెడ్డి అనూరాధ, కర్నూలు జిల్లా ఆదోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తులో కావలసిన స్ఫూర్తిదాయకమైన సమాచారాన్ని అందించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి స్వయంగా విద్యార్థులకు కావలసిన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ తెలుగు లెక్చరర్ చెన్నారెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంసిద్ధం కార్యక్రమంలో అధికారులు

పేదల సొంతింటి కల సాకారం

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని, పేదల సొంతింటి కల వైసిపితోనే సాధ్యమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గురువారం పేదలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతగల ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, సొసైటీ చైర్మన్ పి.వి.రాఘవరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, దుంపలగట్టు డీలర్ వెంకట్రామిరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, ఎంపిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు పాఠశాలలను తనిఖీ చేయాలి

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయాలని ఎంపిడిఒ ఫజుల్ రెహిమాన్ తెలిపారు. ఎంపిపి థామస్ అధ్యక్షతన గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా జరగని విధంగా మన రాష్ట్రంలో నాడు- నేడు కింద ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా మారుస్తోందని తెలిపారు. ప్రజాప్రతినిధులు పాఠశాలలను సందర్శించి ఆ పనుల నాణ్యతను తనిఖీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సక్రమంగా వస్తున్నారా లేదా అని కూడా ప్రజాప్రతినిధులు తనిఖీ చేయాలని ఎంపిడిఒ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందుతోందా లేదా చూడాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున మండలంలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నంద్యాలంపేట సర్పంచ్ ఓబయ్య మాట్లాడుతూ హైవే బైపాస్ నిర్మాణంలో తాగునీటి పథకాలు దెబ్బతింటూ, నీటి సమస్య ఉత్పన్నమవుతోందని తెలిపారు. సర్పంచ్ ఫిర్యాదుపై ఎంపిడిఒ స్పందిస్తూ హైవే బైపాస్ నిర్మాణంలో దెబ్బతిన్న తాగునీటి పథకాల స్థానంలో కొత్తవి వేసేందుకు సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ డ్రిప్ పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పలువురు అధికారులు తమ శాఖల అభివద్ధిపై నివేదికలు చదివి వినిపించారు. వనిపెంట ఎంపీటీసీ ఇర్షాద్ మాట్లాడుతూ సమస్యలపై సమావేశంలో మాట్లాడాలంటే మండల స్థాయి అధికారులు సమావేశానికి రావడం లేదన్నారు. ఇకనుంచి సమావేశాలకు మండలస్థాయి అధికారులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వనిపెంట హైస్కూల్లో తాగునీటి సమస్యను తీర్చాలని సర్పంచ్ గౌస్ లాజమ్ కోరారు. సమావేశంలో వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, జడ్పిటిసి ప్రసన్న లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల సమావేశంలో ఎంపిడిఒ, ప్రజాప్రతినిధులు

గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వైఎస్ఆర్ హయాంలోనే ప్రాజెక్టులు పూర్తి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే జిల్లాలోని ప్రాజెక్టులు దాదాపు పూర్తి చేశారని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పైడిపాలెం ప్రాజెక్టు వద్ద గురువారం దాదాపు మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన జికెఎల్ఐ గెస్ట్‌హౌస్‌ను, సబ్ డివిజన్ కార్యాలయం, వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పైడిపాలెం ప్రాజెక్టు పులివెందుల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. నేడు జిల్లా సస్యశ్యామలంగా ఉందంటే దానికి కారణం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ అన్నారు. వైఎస్ఆర్ ఎంతో ముందుచూపుతో ఆలోచించి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని కొనియాడారు. ఇరిగేషన్ శాఖ సిఇ మల్లికార్జున్‌రెడ్డి, డిఇ శ్రీనివాస్, జెఇ అశోక్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలవి ఉడుత ఊపులే

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రాంతీయ పార్టీలవి ఉడుత ఊపులేనని, చింతకాయలు రాలవని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపికి బానిసలు అన్నారు. రాష్ట్రానికి బిజెపి నెంబర్ వన్ ద్రోహి అన్నారు. ప్రత్యేకహోదాకు పంగ నామాలు పెట్టి రాయల సీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిం దన్నారు. బిజెపికి ఎలాంటి బలం లేకపోయిన మూడు పార్టీలు బిజెపి చేతిలో కీలుబొమ్మలుగా మారి పోయినట్లు చెప్పా రు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాబోవు ఎన్నికల్లో దుష్ట చతుష్టయ పార్టీలైన బిజెపి, వైసిపి, టిడిపి, జనసేనను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధృవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, వెంకటేష్, అమర్, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ' విగ్రహ ఏర్పాటు అనుమతికి వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో తొలి స్వాతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని రాఘవేంద్ర హాల్ సర్కిల్‌లో ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ పులివెందుల నియోజకవర్గ నాయకులు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రమిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్ల వెడల్పు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరిత గతిన అనుమతులు మంజూరు చేయాలని వారు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ స్వాతంత్రోద్యమ త్యాగధనుల విగ్రహాలను పట్టణంలో ఏర్పాటు చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు ప్రభుత్వం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాకరాపురం కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, రెడ్డికమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ పులివెందుల నియోజకవర్గ నాయకులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, చప్పిడి కృష్ణారెడ్డి, ముత్తుకూరు ప్రదీప్‌రెడ్డి, ఓబులరెడ్డి, శివశంకర్‌రెడ్డి, హిందూ ఉపాధ్యాయ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్‌వి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలను తమ గ్రామం ముంగిటికే తీసుకొచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జాషువా, ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF IV Addl. JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 249/2022

Palagiri Veera Reddy, S/o Narayana Reddy, Narasa Reddypalli Village, Chennur Mandal, Kadapa Dist.
...Plaintiff

Vs

Malireddy Veera Reddy, S/o Sankar Reddy, D.No.1/32, Thappetla Village, Valluru Mandal, Kadapa Dist.
...Defendant

నోటీసు

పై నెంబరులో వాది, ప్రతివాదిపై బాకీ నిమిత్తమై దావా దాఖలు చేసివున్నాడు. ప్రతివాది నోటీసుకు గాను 18.3.2024తేదికి వాయిదా వున్నది. ప్రతివాదికి ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో ఉదయం గం.10.30లకు వాయిదాకు హాజరయి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షములో ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

పి.ప్రతాప్‌రెడ్డి
వాది తరపు అడ్వకేటు.

మహారాజశ్రీ కడప జిల్లా 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 491/2020

టి.సుజాత, భర్త పేరు నాగభూషణరావు, సాకిన్, డోర్ నెం.1/25/4, ఎ.పి.హెచ్.బి.కాలనీ, కడప సిటీ.
...వాది

Vs

యం.నాగమల్లయ్య, తండ్రి సాంబయ్య, సాకిన్ డోర్‌నెం.41/జి-8-6, శంకరాపురం, కడప సిటీ.
...ప్రతివాది

పై దావాలోని వాది, ప్రతివాది అయిన మీ పైన ,దావా మొత్తం రూ.3,43,733/-లు వసూలు కోరి పై దావా దాఖలు చేసియున్నారు. ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలున్న ఎడల 18.3.2024వ తేదీ ఉదయం గం॥ 10.30గం॥లకు పై కోర్టు ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనిఎడల ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

సి. హెచ్. జగదీష్
వాది తరపు న్యాయవాది,
కడప.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె గ్రామ మాజీ సర్పంచ్ పి.రవణమ్మ భర్త, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి గారి రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కె ఓబయ్య గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ టిడిపికి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. వైసిపి పాలనతో విసుగు చెందిన నాయకులు పార్టీలోకి స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్లవోలు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు డి.గురివిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకల బాబు, రవిశంకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, సుబ్బిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో గురువారం ఆయన సతీమణి మౌనికరెడ్డి, సోదరి హరిత పట్టణంలోని పలువురు మహిళలకు సామూహిక సీమాంతాలు నిర్వహించారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు భోగా లక్ష్మీనారాయణమ్మ, కడప పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కోట శ్రీదేవి, 41 వార్డు శూలం లక్ష్మీదేవి, 40వ వార్డు పల్లా లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్ నూర్జహాన్, 28వ వార్డు లక్ష్మీదేవి, 31వ వార్డు మెరువ నీలిమ, 36వ వార్డు కృష్ణవేణి, నందం లక్ష్మీదేవి, బొమ్మిశెట్టి భానుమతి, 35వ వార్డు ఎర్రమరెడ్డి అమ్మని, ఇట్టే చౌడమ్మ, ఇండ్ల లక్ష్మి లిఖిత పాల్గొన్నారు.

శ్రీఅంకాలమ్మ దేవస్థానం చైర్మన్‌గా నాగేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో వెలసిన గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ తల్లి దేవస్థానం చైర్మన్‌గా మళ్లీ రెండవసారి తిరుమల శెట్టి నాగేంద్ర ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో తిరుమల శెట్టి నాగేంద్ర ప్రసాద్ శ్రీ అంకాలమ్మ దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పాలక మండలి సభ్యులుగా సుజాత, నాగభూషణం, అంజలి, వరలక్ష్మి, సుశీలమ్మ, రాముడు బాధ్యతలు స్వీకరించారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నాగేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో విశ్వాసంతో మళ్లీ బాధ్యతలను అప్పగించినందుకు భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీరంగనాథ స్వామి మిట్టమల్లేశ్వర స్వామి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్‌గా చింతకుంట సుధీకర్‌రెడ్డి పాలక మండలి సభ్యులుగా పొట్టిపటి మాధవాచారి, కాంబోజి మల్లికార్జున, మోటా రాజశేఖర్, నంగి సోమేశ్వరమ్మ, బత్తల వాణి, చంద్రావతి, మహేశ్వరి, సూర్యలక్ష్మి గురువారం శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి కల్యాణమండపంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సుధీకర్‌రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ పదవి రెండవసారి తనపై నమ్మకంతో కట్టబెట్టిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డికి, వైయస్ భాస్కర్‌రెడ్డికి, వైయస్ మనోహర్‌రెడ్డి ఇతర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోరాట ఫలితమే విద్యుత్ దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య పోరాట ఫలితంగా పట్టణంలో స్థానిక నాగులకట్ట వీధి నుండి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు జరిగిందని, లైట్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద విద్యుత్ దీపాలను పరిశీలించారు. సమస్యను యువజన సంఘంగా గుర్తించి అనేక దఫాలుగా మున్సిపల్ అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు, ప్రజాసంఘాల అధ్వర్యంలో జమ్మలమడుగు శాసన సభ్యులు సుధీర్‌రెడ్డికి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఎట్టకేలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రజా సమస్యను గుర్తించి లైట్లు వేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తులసిశ్వర్ యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు అనుక్, ఇసాక్, నాగేంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ నాగిరెడ్డికి సమాధానం చెబుతున్న కమిషనర్ రామకృష్ణయ్య

కౌన్సిల్ సమావేశామా..? పార్టీ కార్యక్రమమా?

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ హార్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశాన్ని కౌన్సిలర్లు బహిష్కరించిన విషయం విదితమే. అనంతరం ఎజెండాలోని అంశాలపై కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ రామకృష్ణయ్య సమాధానాలు చెప్పారు. గత టిడిపి ప్రభుత్వంలో పట్టణంలో చేసిన 2016-17 ఎస్సీ సబ్‌ప్లాన్ పనులకు సంబంధించి రూ.22.33 లక్షలు నగర పంచాయతీ సాధారణ నిధుల నుండి సుధీర్ కన్స్ట్రక్షన్స్, ఎస్.గోపాల్‌రెడ్డి కాంట్రాక్టు సంస్థలకు బిల్లులు చెల్లించేలా ఎజెండాలో కౌన్సిల్ ఆమోదం కోసం పొందుపరిచారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వంలో చేసిన పనులకు ఇప్పుడు సాధారణ నిధుల నుండి బిల్లులు చెల్లించడం ఏంటని, పనులు జరిగాయో లేదో కూడా తెలియని తాము ఎలా ఆమోదించాలంటూ ప్రశ్నించారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొనడం అందరిని ఆశ్చర్యాన్ని గురిచేస్తోంది. గత రెండు, మూడు కౌన్సిల్ సమావేశాలలో కౌన్సిలర్లు తమ అసమ్మతి గళాన్ని బహిరంగంగానే వినిపించారు. ఆ క్రమంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి వైసిపి నాయకులు రావడం, అధికారులు వారికి ప్రత్యేకంగా కుర్చీలు వేయడం ఏంటని పుర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కౌన్సిల్ సమావేశమా.. లేక పార్టీ సమావేశమా అంటూ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కేవలం కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేసి వారికి అవసరమైన అంశాలను ఎజెండాలో పొందుపరిచి ఆమోదించుకునేలా చేసే చర్యలను ఆదిలోనే ఖండించాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 302/2023

Andhra Pragathi Grameena Bank, rep by its Branch Manager, Modampalli. ...Plaintiff

Vs

G.Chandr sekhar and Another. ...Defendants

2వ ప్రతివాదికి దావా సమను

Sapatla Vinod Kumar, S/o Anand Rao, aged about 30 years, Business, Residence of D.No.7/3172-2(Up), Srinivasa Nagar, Proddatur Town, Kadapa (D).

పై నెంబరు దావాను వాది, దావా మొత్తం రూ.68,984/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన దావాలో 2వ ప్రతివాది అయిన మీకు తేది 15-03-2024న ఉదయం 10.30ని॥లకు హాజరు కావలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 15/03/2024

//కోర్టు ఉత్తర్వు మేరకు//

P.RAMACHANDRA REDDY
B.RAMA DEVI
Advocates,
PRODDATUR.
Cell: 9908548965.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No. 224/2009
O.S.No. 249/2004

1. ఎన్.పౌలు, పోతి, అతని వారసులు.
2. ఎన్.సుజీవమ్మ, W/o లేట్ పౌలు, 54 సం॥లు.
3. ఎన్... టి.నిర్మల, D/o లేట్ పౌలు, 43 సం॥లు.
4. ఎన్.సునీల్, S/o లేట్ ఎన్.పౌలు, 36 సం॥లు.

...పిటిషనర్లు/D.Hrs

Vs

8. ధనిరెడ్డి చంద్రకళ, W/o భాస్కర్‌రెడ్డి, 44 సం॥లు, హిందూ, డోర్‌నెం.7/1294-1, గోకుల్‌నగర్, ప్రొద్దుటూరు, కడప జిల్లా. ...8వ రెస్పాండెంట్

నోటీసు

ఈ నెంబరు E.P.లోని 2వ రెస్పాండెంటు/**J.Dr.No.2** చనిపోయినందున ఆయన వారసులు అయిన మిమ్మల్ని 8వ రెస్పాండెంటుగా చేర్చకోరుచూ E.A.No.204/2023 నెంబరు పిటిషన్‌ను దాఖలు చేసినాము. అట్టి పిటిషన్‌లో మీరు హాజరు అగుటకు గానూ 21.3.2024వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు పై కోర్టులో ఉదయం 10.30గం॥లకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ ఏదైన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది:21/3/2024

//By Order of the Court//

G. SRINIVASULU, B.Com.,B.L.,
Advocate,
PRODDATUR.